Registered No: APTEL/25/A/2618
ఇది కద నిజం
ఆదివారం 20-09-2026

# ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డిని కలిసిన నల్లాల వినయ్ కుమార్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కొంపల్లి: టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ కుమార్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ కొంపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా పాలన, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై చర్చించారు. అలాగే కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఇరువురు నాయకులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చర్చించారు.

# యూపీహెచ్‌సీ కేంద్రంలో వైద్య సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించిన ఎమ్మెల్యే






ఇది కద నిజం :చింతలపూడి నగర పంచాయతీలో నిర్వహించిన స్వర్ణాంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అనంతరం చింతలపూడి శాసనసభ్యులు స్థానిక యూపీహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే డేటా ఎంట్రీ ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో స్వయంగా కంప్యూటర్‌ను ఆపరేట్ చేస్తూ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అఫ్రీన్ గారు, హెచ్ డి ఎస్ కమిటీ సభ్యులు సొంగా ఏసు పాదం గారు,సిబ్బంది మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# గుంతల మయంగా వీరణపేట్ రోడ్డు

## నరకం చూస్తున్న ప్రయాణికులు, గర్భిణులు







ఇది కద నిజం,జిల్లెడ్ చౌదరిగూడ: గాలిగూడ వయా షాద్‌నగర్ రూట్‌లో వీరణపేట్ గ్రామం నుంచి ఘనపూర్ గేట్ వరకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలుగా మారి, అధ్వానస్థితికి చేరుకోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు ఈ రోడ్డుపై ప్రయాణం ప్రాణాంతకంగా పరిణమించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో కూడా జిల్లెడ్ చౌదరిగూడ మండలంలోని వీరణపేట్ రోడ్డు తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, పలుమార్లు విన్నవించినా ఈ సమస్యను ఏమాత్రం పట్టించుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా తయారైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ తీవ్రమైన రహదారి సమస్యను గుర్తించి, వెంటనే నూతన రోడ్డు పనులను ప్రారంభించాలని జనసేన పార్టీ జిల్లెడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు భూమగళ్ళ రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక దృష్టి సారించి, వీరణపేట్ రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయించి ప్రజల కష్టాలను తీర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, బూట్ల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ కుమ్మరి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపసర్పంచ్ అవేస్ బేగ్, ఎస్ఐ ఆంజనేయులు, మండల విద్యాధికారి దేవి సింగ్ పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్, బూట్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుమ్మరి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ప్రతి విద్యార్థి పెద్ద కలలు కని వాటిని సాకారం చేసుకునే దిశగా పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిఫామ్, బూట్లు తదితర సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు భారంగా మారకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి తన ప్రతిభతో పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జుక్కల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్, ఉపాధ్యాయులు రూప్‌సింగ్, హట్టి సింగ్, ప్రమోద్ కుమార్, సంతోష్ రెడ్డి, మనోజ్ కుమార్, సీఆర్పీ హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పులుమామిడిలో 'ఇరుముడి' సినిమా ప్రదర్శన

## ఆధ్యాత్మిక వాతావరణంలో అలరించిన చిత్రం





ఇది కద నిజం, పులుమామిడి: నవాబుపేట్ మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై 'ఇరుముడి' సినిమాను ప్రదర్శించారు. గణేష్ మండప ప్రాంగణంలో అందంగా అలంకరించిన వినాయకుని విగ్రహం ముందర డిజిటల్ తెరపై ప్రదర్శించిన ఈ చిత్రాన్ని చూసేందుకు గ్రామానికి చెందిన చిన్నారులు, మహిళలు, భక్తులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రదర్శన సందర్భంగా భక్తి రసంతో కూడిన దృశ్యాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల భాస్కర్ రెడ్డి, సాయిరాం గౌడ్, ఉమామహేశ్వర్ రెడ్డి, సుదర్శన్, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు పాల్గొని ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భక్తి, ఆధ్యాత్మిక భావనలను నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతోనే 'ఇరుముడి' సినిమా ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామి అయ్యప్ప భక్తుల విశ్వాసాలు, ఇరుముడి ప్రాశస్త్యం, భక్తి మార్గంలో నడవాల్సిన విశిష్టతను ఈ చిత్రం ఎంతో ప్రతిభావంతంగా చాటిచెబుతుందని వారు పేర్కొన్నారు. అలాగే, ధర్మ పరిరక్షణకు, మాతృభూమి సేవకు తమ జీవితాన్ని అంకితం చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని నాయకులు కొనియాడారు. శివాజీ చూపిన శౌర్యం, దేశభక్తి, ధర్మ నిష్ఠను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, సమాజ శ్రేయస్సు కోసం యువత ముందుండాలని పిలుపునిచ్చారు. భక్తిభావంతో పాటు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించిన ఛత్రపతి శివాజీ యూత్ ప్రతినిధులను గ్రామస్థులు ఈ సందర్భంగా అభినందించారు.

# రైతువేదికలో చోరీ



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: మండలంలోని తిమ్మనగర్ రైతువేదికలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం రాత్రి రైతువేదిక తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు బ్యాటరీ, ఇన్వర్టర్‌ను అపహరించారు. ఏఈఓ ప్రదీప్ ఫిర్యాదు మేరకు ఎస్సై బి. అంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

# వెంకటగిరి పట్టణంలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(ఇది కద నిజం):– స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు, పురపాలక సిబ్బంది మరియు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వయంగా చీపురు పట్టి వీధులను శుభ్రం చేసి స్వచ్ఛతా శ్రమదానంలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ:గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు మూడోవ శనివారం ఈ స్వచ్ఛతా కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ప్రజలు తమ ఇళ్లను ఎలాగైతే పరిశుభ్రంగా ఉంచుకుంటారో, వీధులను కూడా అంతే శుభ్రంగా ఉంచాలని కోరారు. రోడ్లపై చెత్తాచెదారం వేయకుండా, చెత్తను బుట్టల్లో సేకరించి ఉంచాలని, ప్రతిరోజూ మున్సిపాలిటీ వాహనాలు వచ్చినప్పుడు ఆ చెత్తను వారికి అందించాలని సూచించారు.తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలక అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన రూట్‌మ్యాప్ పరిశీలన



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: పిట్లం మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమజ్జన రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. నిమజ్జన విగ్రహాలు వెళ్లే మార్గం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అవసరమైన చర్యలపై చర్చించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, తహసీల్దార్ మహేందర్, ఎస్ఐ బి. ఆంజనేయులు, ఉపసర్పంచ్ అవేజ్ బేగ్, పంచాయతీ కార్యదర్శి బలరాం పాల్గొన్నారు.

# ఎర్రవల్లి భూముల సర్వేలో మరో మలుపు

ఎర్రవల్లి,ఇది కద నిజం: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి లో భూముల సర్వే మరో మలుపు తిరిగింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని 325 సర్వే నెంబరులో 388 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే, ఈ భూముల్లో తమకూ వాటా ఉందంటూ శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామస్థులకు 250 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన భూమిలో తమకూ హక్కులు ఉన్నాయని వెంకటాపూర్ వాసులు చెబుతున్నారు. కాస్రా, సిత్వార్ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగానే భూ రికార్డుల్లో మార్పులు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తమకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

# కోదాడలో విజయవంతంగా మెగా జాబ్ మేళా ...

## పాల్గొన్న మండలి చైర్మన్, శాసన సభ స్పీకర్, మంత్రులు ..



నల్లగొండ (ఇది కద నిజం): ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ప్రైవేటు రంగాల్లో ఉన్న అద్భుతమైన అవకాశాలను కూడా అందించుకోవాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో కోదాడ లో మెగా జాబ్ మేళా నిర్వహించారు.. ఈ ఇజాబ్ మేళాలో దాదాపు 250కి పైగా ఐటీ, ఇతర కంపెనీలు పాల్గొనగా...... ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల వ్యాప్తంగా 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన 5వేల మంది వరకు నిరుద్యోగులు హాజరయ్యారు.. ఉదయం 8గంటలకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి లు జాబ్ మేళా ప్రారంభించారు.. ఈ జాబ్ మేళా మొదటి సెషన్ లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లు పాల్గొని ఇంటర్వ్యూలు పర్యవేక్షణ చేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో నిర్వహించిన ఈ జాబ్ మేళా కు నిరుద్యోగుల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని అన్నారు.. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రోడ్లు--భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శఅడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొనీ ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేశారు. ఇలాంటి జాబ్ మేళాల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు రావడమే కాకుండా, పరిశ్రమలకు కూడా నిపుణులైన సిబ్బంది దొరుకుతారని అందుకే జాబ్ మేళా ల ద్వారా పరిశ్రమలకు కూడా మేలు జరుగుతుందని అన్నారు..

